క్లుప్తంగా

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకి శ్రీనివాసానగర్‌లో డ్రెయినేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే బోడెప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రెయినేజీ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



నున్న(విజయవాడరూరల్): నున్న కోటకట్ట సెంటర్లో గంపా భూదేవమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి ఏటా ఎండాకాలంలో ప్రజల దాహార్తి తీర్చడం కోసం గ్రామంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని భూదేవమ్మ కుమారుడు గంపా బాబురావు తెలియజేశారు. కార్యక్రమంలో బాబురావు కుటుంబ సభ్యులతో పాటు వార్డు సభ్యుడు గంపా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గన్నవరంలో..



గన్నవరం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకురావాలని విశ్రాంత అధ్యాపకుడు గన్నె వెంకట్రావు కోరారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విశ్రాంత ఉపాధ్యాయులు కర్రా వరప్రసాద్ సౌజన్యంతో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బాల కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి ప్రసాదరావు, సభ్యుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష మల్లెలతో అర్చన



నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామం శ్రీ చంద్రశేఖరేంద్రస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు, వైశాఖ పూర్ణిమ సందర్భంగా సోమవారం శ్రీ వేంకటేశ్వరస్వామికి లక్ష మల్లెపూలతో అర్చన చేశారు. అనంతరం వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారిని నందివాహనం మీద ఊరేగింపు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా స్వామివారి గ్రామోత్సవం



పెనమలూరు: పోరంకి గ్రామంలో శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వసంత వేణు గోపాలస్వామి వార్ల గ్రామోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఆదివారం రాత్రి స్వామి వారి దివ్య తిరుక్కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సోమవారం స్వామిని అలంకరించి గరుడ వాహనంలో ఊరేగించారు. నిత్య హోమం, వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు.

పదకవితకు పట్టాభిషేకం

విజయవాడ కల్చరల్: శ్రీ వేంకటేశ్వర సంకీర్తనా అకాడమీ, కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుడు 617వ జయంతి వేడుకలు రెండో రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం అన్నమాచార్యుల సంకీర్తనలు పాడుకుంటూ సంగీత విద్వాంసులు నిర్వహించిన శోభాయాత్ర శోభాయమానంగా సాగింది. పున్నమ్మతోట టీటీడీ కల్యాణమండపం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర లబ్బీపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చేరుకుంది. దారిపొడవునా అన్నమయ్యకు భక్తులు నీరాజనాలు సమర్పించారు. సంగీతోత్సవంలో భాగంగా పోపూరి శ్యామసుందర్, అంజనాసుధాకర్, చింతలపాటి హరిత, లక్ష్మీజయతి, నాగపూజిత, కుందుల అనిల్‌కుమార్, పోపూరి షణ్ముఖ ప్రియ, ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల విద్యార్థినులు, అనూష త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. 'శ్వాస' సభ్యులు సత్యబాలు, ప్రసాద్, దుగ్గిరాల శ్రీలత, హాస శ్రీమేధ నిర్వహించారు. దేవాలయంలోని అన్నమాచార్య విగ్రహానికి దేవాలయ మేనేజర్ శర్మ, నిర్వహణ బాధ్యులు డాక్టర్ సి. రామ్మోనరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెత్త నుంచి సంపద సాధ్యమా?

గ్రామాల్లో మూతవేసి ఉన్న సంపద కేంద్రాలు



నున్న గ్రామంలో చెత్త లేని సంపద కేంద్రం



అలంకార ప్రాయంగా పాతపాడు చెత్త సంపద కేంద్రం



మూతపడిన అంబాపురం చెత్త సంపద కేంద్రం

విజయవాడరూరల్: చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు కూటమి ప్రభుత్వంలో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో చెత్త కనిపించడంలేదు. చెత్తే లేనప్పుడు వాటి నుంచి సంపద ఎలా తయారు చేస్తారని ఆయా గ్రామాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో ప్రతి వెయ్యి మంది జనాభాకు చెత్త సేకరించేందుకు ఒక క్లాప్ మిత్రను నియమించి కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.6వేలను ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనం చెల్లిస్తోంది. అదేవిధంగా గ్రామ పంచాయతీ మరో రూ.6వేలను కలిపి ఇస్తోంది.

వేర్వేరుగా తడి, పొడి చెత్త సేకరణ

గ్రామాల్లో క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి తడి , పొడి చెత్త వేర్వేరు ప్లాస్టిక్ బుట్టల ద్వారా సేకరించి, దాన్ని ప్రత్యేక వాహనాల ద్వారా చెత్త డంపింగ్ కేంద్రాలకు తరలించాల్సి ఉంది. సేకరించిన చెత్త డంపింగ్ కేంద్రాలకు రావడం లేదు. జిందాల్ సంస్థ చెత్తను గుంటూరుకు తీసుకెళ్లి పవర్ తయారీకి వినియోగిస్తోంది. దీంతో గ్రామాల్లోని డంపింగ్ కేంద్రాలు చెత్త లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అలాంటప్పుడు చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేసి గ్రామ పంచాయతీలకు సంపదను సృష్టించడం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్న తలెత్తుతోంది.

కనిపించని చెత్త

నున్న గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం చెత్త లేకుండా కనిపిస్తోంది. ఆ కేంద్రానికి తాళం వేసి ఉన్నారు. అదే విధంగా పాతపాడు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం రంగులువేసి కనిపిస్తోందే తప్ప చెత్త కనుచూపు మేర కనిపించడం లేదు. అంబాపురం గ్రామంలోని మోడల్ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం గత కొన్ని నెలలుగా చెత్త తరలించడం లేదు. ఎరువుల తయారు చేసే తొట్టెలు ఖాళీగా ఉన్నాయి. ఇక పోతే గొల్లపూడి, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో అయితే చెత్తడంపింగ్ కేంద్రాలు లేక పోవడం ఆశ్చర్యం. ఈ గ్రామాల్లో ప్రతి రోజూ వచ్చే చెత్తను గుంటూరుకు తరలిస్తున్నారు. ఇంకా చెత్త నుంచి సంపద తయారు చేసేదెక్కడనే ప్రశ్నలకు అధికారులు సమాధానం మరింత ఆశ్చర్యాన్ని కల్గిస్తోంది. గ్రామాల్లో ప్రజల నుంచి సేకరించే చెత్త ద్వారా వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేసి ఇంటింటికీ వెళ్లి ఉచితంగా వర్మీ కంపోస్టును ప్యాకెట్ల ద్వారా అందజేస్తున్నామని చెబుతున్నారు. గ్రామాల్లో చెత్త లేకుండా మూతవేసే దిశగా కేంద్రాలు దర్శనమిస్తుంటే ఎరువు తయారు చేస్తున్నట్లు రికార్డులు చూపెడుతుండడం దారుణం.

178 మంది క్లాప్ మిత్రలు

మండలంలో 178 మంది క్లాప్ మిత్రలు పని చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను గత ఏడాది విజయవాడ రూరల్ మండలానికి రూ.కోటీ 93లక్షలను కేటాయించింది. ఆ నిధుల వినియోగం సక్రమంగా లేదని ఆడిట్ అభ్యంతరాలు నమోదైనట్లు తెలిసింది.

చెత్త సేకరించడం లేదు



గ్రామంలో చెత్త సేకరణ నామమాత్రంగా జరుగుతోంది. పైపుల రోడ్డు ప్రాంతంలో ఒక్క క్లాప్ మిత్ర కూడా విధులు నిర్వహించిన దాఖలాలులేవు. స్వచ్ఛాంధ్రా, స్వచ్ఛదివస్‌లు కేవలం కంటి తుడుపు చర్య. రోడ్లపై ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, మురుగు కాల్వలు దర్శనమిస్తున్నాయి. పట్టించుకున్న అధికారులే లేరు.

– చంద్రశేఖర్, అంబాపురం

వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేస్తున్నాం



గ్రామాల్లో చెత్త సేకరణ చేసి వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేసి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కోసం ఉచితంగా అందజేస్తున్నాం. గత వారం జిల్లా హెడ్‌క్వార్టర్లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కౌంటర్‌ను ఏర్పాటు చేశాం.

– ఎంవీడీ ప్రసాద్, ఈఓఆర్డీ

రజనిపై దురుసుగా ప్రవర్తించిన సీఐపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు, వైఎస్సార్ సీపీ నేతలు

గన్నవరం: మాజీ మంత్రి, చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి విడదల రజనిపై దురుసుగా ప్రవర్తించిన సీఐపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి డిమాండ్ చేశారు. విడదల రజనిపై పోలీసుల వైఖరికి నిరసనగా స్థానిక రాయ్‌నగర్‌లో సోమవారం జెడ్పీటీసీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీకి చెందిన అనేక మంది మహిళా నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. మాజీ మంత్రి, మహిళ అనే కనీస గౌరవం లేకుండా కారులో కూర్చొన్న రజనిని పోలీసులు చేయి పట్టుకుని కిందకు లాగడం దారుణమన్నారు. ఇప్పటికైనా జరిగిన సంఘటనపై విడదల రజనికి భేషరతుగా క్షమాపణ చెప్పి, సదరు సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పులిమర్తి చిన్నమస్తాన్, కాట్రు ధర్మరావు, రత్నమాల, అన్నవరపు జయలక్ష్మీ, రజిత, పద్మ, రజని, పూజిత, సిరి, సురేష్ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ సమితి కామ్రేడ్ జీఆర్‌కే, రాగసుధామయి క్రియేషన్స్ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై సోమవారం క్లాసికల్ చిత్రగీతాలు, హిందీ చిత్రగీతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గాయకులు రవికుమార్, శేఖర్, మోహన కృష్ణ, పెద్దిరెడ్డి, కోటి, మస్తాన్ వలీ, మోహనలక్ష్మి, నిషిత, ఉషారెడ్డి పలు చిత్రగీతాలను ఆలపించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె కరపత్రాలను ఆవిష్కరించిన నేతలు

ఉంగుటూరు(గన్నవరం): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఉంగుటూరులోని ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. ఇప్పటికైనా కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. సార్వత్రిక సమ్మెలో అన్ని కార్మిక వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు టీవీ. లక్ష్మణస్వామి, ఆజ్మీర్ వెంకటేశ్వరరావు, రాజారావు, సలీం, సాంబశివరావు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ పేరుతో కూటమి ప్రభుత్వం దోపిడీ



ఉయ్యూరు ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న దేవభక్తుని చక్రవర్తి, నాయకులు

ఉయ్యూరు రూరల్: వెనుకబడిన పేద, బలహీన వర్గాల మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ పేరుతో కోట్లాది రూపాయలను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు సోమవారం ఆర్డీఓ షారోన్‌కు కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళలకు కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీ పేరుతో కూటమి ప్రభుత్వం సుమారు రూ.150 కోట్ల నుంచి రూ.160 కోట్ల ప్రజా ధనాన్ని వారి అనుచరులకు దోచి పెట్టే కుట్ర కు తెర లేపిందని ఆరోపించారు. ఒక్కో మహిళకు శిక్షణ ఇచ్చేందుకు సుమారు రూ.23 వేల పైన ఖర్చు చేయడానికి వారి అనుకూల సంస్థలకు ప్రాజెక్ట్‌ను అప్పగించారని విమర్శించారు. శిక్షణ తరగతులు ప్రభుత్వ కార్యాలయాలకు బదులుగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కార్యాలయంలో నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ శిక్షణలో అర్హులైన మహిళలకు కాకుండా కేవలం వారి అనుకూల వర్గాల వారికే లబ్ధి చేకూర్చే దుర్మార్గపు ఆలోచన చేయటం సిగ్గుచేటు అన్నారు. నాసిరకం కుట్టు మిషన్లను అందజేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. తక్షణమే టీడీపీ కార్యాలయాల్లో ఉన్న శిక్షణ కేంద్రాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజా ధనాన్ని దోచుకోవాలని చూస్తే వైఎస్సార్ సీపీ పోరాటం ఉద్ధతం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సోలే సురేష్, కౌన్సిలర్ గోన మదన్, ఎంపీటీసీ సభ్యుడు బందెల శ్రీనివాసరావు, ఉయ్యూరు పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు దాసే రవి, శ్రీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్ ఇందిరా ప్రియదర్శిని, నాయకులు జంపాన కొండలరావు, రాజులపాటి రామచంద్రరావు, అబ్దుల్ సద్దాం, సంజయ్‌తోపాటు ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధుల్లోనే చెత్త కుప్పలు



చోడవరంలో రహదారి పక్కనే చెత్త కుప్ప



రామవరప్పాడు పంచాయతీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు వద్దే చెత్త



రైల్వేస్టేషన్‌కు వెళ్లు దారిలో పేరుకుపోయిన చెత్త

పెనమలూరు: చోడవరం గ్రామంలో పారిశుధ్యం లోపించింది. గ్రామంలో ప్రధాన రహదారుల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రసంగాలు చేసే అధికారులు, నాయకులు గ్రామంలో చెత్త కుప్పలను తొలగించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. చోడవరంలో చెత్త తరలించేందుకు ఆటోలు, రిక్షాలు ఉన్నాయి. పారిశుధ్య కార్మికులు రోజూ చెత్త సేకరించేవారు. కొద్ది రోజులుగా చెత్త సేకరణ సక్రమంగా జరగటం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రధానంగా బీసీ, ఎస్సీ కాలనీల్లో చెత్త సేకరించడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రామవరప్పాడులో..

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు రైల్వేస్టేషన్‌కు వేళ్లే మార్గంలో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామంలోని రైవస్ కాలువ వంతెన దాటిన తర్వాత రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ విషయం పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఇక్కడ చెత్త పడేయరాదంటూ నోటీసు బోర్డును తగిలించి అధికారులు చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ఆ నోటీసు బోర్డు ముందే చెత్తను పడేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త కుప్పలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాబూ.. పంట నష్ట పరిహారం ఎక్కడ..?

ఎదురుచూస్తున్న రైతులు



గాలి వానకు నేలమట్టమైన అరటి పంట

పెనమలూరు: మండలంలో 10 రోజుల క్రితం వచ్చిన గాలివానకు పంటలు నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు న్యాయం జరగలేదు. ఉద్యానవన పంటలు ఈదురు గాలులకు పూర్తిగా నేలమట్టమై రైతులు తీవ్రంగా నష్ట పోయారు. పంట నష్ట పరిహారం వెంటనే ఇస్తామని సీఎం చంద్రబాబు పచ్చ పత్రికల్లో ప్రకటనలు చేశారు. అయితే ఇప్పటికీ రైతులకు నయాపైసా పరిహారం అందలేదు. పది రోజుల క్రితం హఠాత్తుగా గాలి వాన రావటంతో అరటి, బొప్పాయి, తమలపాకులు, కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిని, రైతులక కన్నీళ్లు మిగిల్చింది. అరటి తోటలైతే విరిగి నేల వాలాయి. కొద్ది రోజుల్లో అరటి పంట చేతికి వస్తుందని రైతులు ఆశతో ఉండగా అరటి గెలలతో ఉన్న చెట్లు గాలివానతో విరిగిపోయాయి. దీంతో రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. తమలపాకులు, కూరగాయల పంటలు కూడా గాలి వానకు దెబ్బతిన్నాయి.

పరిహారం మరిచారు

గాలి వానకు దెబ్బతిన్న పంటలను అధికారులు వెంటనే ఎన్యూమరేషన్ చేశారు. అరటి పంటకు హెక్టార్‌కు రూ.35 వేలు, తమలపాకుకు హెక్టార్‌కు రూ.75 వేలు, బొప్పాయి, కూరగాయల పంటలకు హెక్టార్‌కు రూ.25 వేల చొప్పున సాయం అందిస్తామని ప్రకటించారు. మండలంలో అరటి పంట 28.29 హెక్టార్లు, తమలపాకు పంట 4.95 హెక్టార్లు, కూరగాయలు 4.28 హెక్టార్లు, బొప్పాయి రెండు ఎకరాల పంట చొప్పున నష్టం జరిగిందని గుర్తించారు. వివరాలను జిల్లా అధికారులకు నివేదిక పంపారు. ప్రభుత్వ ప్రకటనలు నమ్మిన అధికారులు కూడా వెంటనే పరిహారం అందుతుందని రైతులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం కూడా సాయంత్రం కల్లా పరిహారం అందుతుందని ప్రకటన చేసింది. అయితే పంట నష్టం జరిగి 10 రోజుల కావస్తున్నా ప్రభుత్వం నుంచి రైతులకు పరిహారం అందలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాయం అందలేదు



ఈదురు గాలులు వర్షం కారణంగా నష్టపోయిన పంటకు ఇప్పటివరకు ప్రభుత్వం సాయం ఇవ్వలేదు. రైతులకు వెంటనే పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేసి ఇప్పుడు మౌనంగా ఉండటం తగదు. రైతులు దెబ్బతిన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పంట నష్టపరిహారం వెంటనే రైతులకు చెల్లించాలి.

– పి.రవి, అరటి రైతు, గోసాల

ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొనసాగించాలంటూ కూలీల ధర్నా



సచివాలయం ఎదుట ధర్నాచేస్తున్న ఉపాధి కూలీలు

గన్నవరం రూరల్: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రావణ్‌కుమార్‌ను కొనసాగించాలని కోరుతూ మండలంలోని ముస్తాబాద గ్రామ సచివాలయం ఎదుట కూలీలు సోమవారం ధర్నా చేశారు. ధర్నాకు మద్దతు తెలిపిన సీపీఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఎలాంటి తప్పు చేయకపోయినా రాజకీయ ఒత్తిళ్లతో వేరే వారికి ఈ బాధ్యతలు అప్పగిస్తామని అధికారులు చెబుతున్నారని, ఇది ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ కూలీలకు తిప్పలు తప్పడం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమం చేయటంతో పాటు బాధ్యులందరిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కళ్లం రాంబాబు, కైలే ఏసుదాసు, బొడ్డు బాలశౌరి, కూరేటి వెంకయ్య పాల్గొన్నారు.

డ్రెయిన్ కోసం మట్టిని తవ్వారు.. వదిలేశారు



నిలిచిపోయిన డ్రెయిన్ నిర్మాణ పనులు

గన్నవరం: స్థానిక ఆగిరిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డులో సీసీ డ్రెయినేజీ నిర్మాణం కోసం చేపట్టిన పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీ నిధులతో చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులను వారం రోజుల క్రితం ప్రారంభించారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి రెండు వందల మీటర్ల పొడవునా డ్రెయిన్‌ను తవ్వి మట్టిని ఆర్అండ్‌బీ రోడ్డుపై పోశారు. ఒక్క రోజు వ్యవధిలోనే ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కాంట్రాక్టర్‌ను తప్పించారు. దీంతో డ్రెయిన్ పనులు నిలిచిపోయాయి. రోజులు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ఎదుట మూడు అడుగుల లోతున తవ్విన డ్రెయిన్ గుంతలు వల్ల రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. అంతే కాకుండా రోడ్డుపై పోసిన మట్టిగుట్టలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పాడుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి డ్రెయిన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

వణుకూరులో రోడ్డు ప్రమాదం

గ్రామంలో ఉద్రిక్తత



వణుకూరులో ప్రమాద ఘటన వద్ద గ్రామస్తులు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. గ్రామానికి చెందిన కె.రవికుమార్ బైక్ పై గోసాల నుంచి వణుకూరుకు బయలుదేరాడు. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద లారీని ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో లారీ డ్రైవర్ రోడ్డు పై గుంతలు తప్పించటానికి పక్కకు తిప్పాడు. దీంతో బైక్ పై ఉన్న రవికుమార్ బ్రేక్ వేయడంతో రోడ్డు పై ఉన్న ఇసుక, గుంతలు కారణంగా అదుపు తప్పి పడిపోయాడు. బైక్ లారీ కిందకు వెళ్లింది. రవికుమార్ మరో పక్కకు పడ్డాడు. ఈ ఘటనలో రవికుమార్‌కు గాయాలయ్యాయి. తృటితో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటనపై లారీ డ్రైవర్‌పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేయటంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

విద్యుత్ కోతలతో ప్రజల ఇక్కట్లు

కంకిపాడు: పెనమలూరు మండలం గంగూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో పెనమలూరు, కంకిపాడు మండలాల్లోని అనేక గ్రామాలకు ఆది, సోమవారల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు మూడున్నర గంటలకు పైగా పగటి వేళలోనే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రెండు రోజులుగా ఎండ తీవ్రత కూడా పెరిగింది. మధ్యాహ్నం వేళల్లో ప్రజలు ఇళ్లకు చేరి, ఫ్యాన్‌లు, ఏసీలు, కూలర్లను ఆశ్రయించి సేద తీరుతున్నారు. విద్యుత్ కోత కారణంగా ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు గంగూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను హుటాహుటిన సందర్శించారు. సాంకేతిక సమస్య తలెత్తిన యూనిట్‌ను సందర్శించి యుద్ధ ప్రాతిపదికన మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరించే పనిలో ఉన్నట్లు విద్యుత్ శాఖ అధికారి ఒకరు తెలిపారు.

15న ప్రత్యేక విద్యుత్ అదాలత్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ డివిజన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ రవీంద్రబాబు సోమవారం తెలిపారు. ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఏపీసీపీడీసీఎల్ విజయవాడ సర్కిల్ ఆఫీస్ కార్యాలయం రెండో అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుందన్నారు.